క్లుప్తంగా

పంటకాలువ పూడికతీత ప్రారంభం



తాళ్లపాలం వద్ద కాలువ పూడికతీత పనులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాళ్ల పాలం నుంచి వెళ్లే ప్రధాన పంటకాలువ పూడిక తీత పనులను ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. గత కొంత కాలంగా పంట కాలువ పూడుకుపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం కాలువలు మూసి వేయటంతో యంత్రాల సహాయంతో పూడికతీత పనులను ప్రారంభించారు. మండలంలోని ప్రధాన పంట కాలువగా కావటంతో రాబోయే ఖరీఫ్‌కు రైతులకు మంచి ఉపకారం జరిగే అవకాశం ఉంది.

ఆలయ భూముల కౌలుకు వేలం

కె.గంగవరం: మండలంలోని పామర్రు, అముజూరు, యర్రపోతవరం గ్రామాల్లోని దేవస్థాన భూములు కౌలుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పామర్రులో కొలువైన పట్టాభిరామస్వామి ఆలయానికి చెందిన 7 ఎకరాల 10 సెంట్ల భూమికి, అముజూరులో కొలువైన సోమేశ్వర స్వామి ఆలయానికి చెందిన ఎకరా 86 సెంట్ల భూమికి, యర్రపోతవరంలో కొలువైన వేణుగోపాల స్వామి ఆలయానికి చెందిన 2 ఎకరాల 80 సెంట్ల భూమికి జూన్ 7వ తేదీన ఆయా గ్రామాల్లోని ఆలయాల వద్ద వేలం నిర్వహిస్తామన్నారు. ఈ బహిరంగ వేలంలో పాల్గొనే రైతులు రూ.10 వేల ధరావత్తు చెల్లించి పాల్గొనాలని ఆయన చెప్పారు. పూర్తి వివరాలకు ఆయా గ్రామాల్లోని కార్యాలయ సిబ్బందిని సంప్రదించాలని ఆయన కోరారు.

వచ్చే నెల 6న కౌలు వేలం

రామచంద్రపురం రూరల్: మండలంలోని నరసాపురపుపేటలో వేం చేసి ఉన్న భవానీ శంకర్ స్వామివారి ఆలయ భూములకు జూన్ 6న కౌలుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో వి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వామివారి ఆలయం వద్ద ఉదయం 10 గంటలకు కౌలు హక్కులకు బహిరంగ వేలం నిర్వహించబడుతుందని ఈవో పేర్కొన్నారు.

ఇంగ్లిషు పరీక్షకు 49 మంది గైర్హాజరు

మండపేట: పదో అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా సోమవారం ఇంగ్లిషు పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు పట్టణంలోని పరీక్ష కేంద్రాలకు మొత్తం 71 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 22 మంది మాత్రమే హాజరైనట్టు మండల విద్యాశాఖాధికారి నాయుడు రామచంద్రరావు మీడియాకు తెలిపారు. 49 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు తెలిపారు.

నెహ్రూ, కందుకూరిలకు ఘనంగా నివాళి

మండపేట: భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతులను సోమవారం డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఇరువురి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి కొడవళ్ళ వెంకట సుబ్బారావు, ఆ పార్టీ నాయకులు మగ్గం జాకబ్ రాజబాబు, కుప్పు బాబీ, వల్లబదాసు చిన్న, కాకరపర్తి రాంబాబు, కొండ దుర్గారావు, టీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శునకాల దాడుల నుంచి రక్షణ కల్పించాలి

మండపేట: పట్టణంలోని 30 వార్డుల్లోనూ కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని వాటి బారి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన మున్సిపల్ కమిషనర్ బొడ్డేపల్లి రాముకు వినతి పత్రం సమర్పించారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ రాము స్పందిస్తూ కుక్కల సంతతి పెరగకుండా వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసే విషయమై పశు వైద్యాధికారులతో మాట్లాడతానని చెప్పారు.

సొసైటీ చైర్మన్‌కు మాతృ వియోగం



చుండ్రు సావిత్రి (ఫైల్)

కపిలేశ్వరపురం: మండలంలోని కాలేరు సొసైటీ చైర్మన్, అచ్యుతాపురానికి చెందిన చుండ్రు అమ్మన్న మాతృమూర్తి చుండ్రు సావిత్రి (90) సోమవారం ఉదయం వృద్ధాప్యంతో మృతి చెందారు. ఈమెకు చైర్మన్ చుండ్రు అమ్మన్న, చుండ్రు రామారావు అనే కుమారులు, కుమార్తె అపర్ణ ఉన్నారు. ఆమె మృతికి ఎంపీటీసీ సభ్యులు పలివెల మధు, టేకి సత్యమంజు, వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్డి రుద్రమూర్తి, ఏలేటి గంగరాజు, వల్లూరు సొసైటీ చైర్మన్ ముత్యాల సతీష్ సంతాపం వ్యక్తం చేశారు.

రైతన్నలూ.. నకిలీలతో జాగ్రత్త

- విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తేడా వస్తే పంట ఖతం
- ఎంపికలో అప్రమత్తత అవసరం



విత్తనాలు

రాయవరం: ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతోంది. రైతులు ఇప్పుడిప్పుడే సాగుకు సమాయత్తం అవుతున్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు సన్నద్ధం అవుతున్న తరుణంలో రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా నకిలీ విత్తనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఎరువులు, పురుగు మందులు విక్రయించే డీలర్లు కూడా కొన్ని నిబంధనలు పాటించాలంటున్నారు. 1985 ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం డీలర్లు నిబంధనలు పాటించాల్సి ఉంది.

విత్తన కొనుగోలులో..

వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన డీలరు వద్ద, గుర్తింపు పొందిన సంస్థల వద్ద మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి. సరిగ్గా సీలు వేసి ధ్రువీకరణ పత్రం ఉన్న విత్తన బస్తాలనే కొనుగోలు చేయాలి. విత్తనాల సంచిపై విత్తనం రకం, ల్యాబ్ నంబర్, గడువు తేదీ తదితర విషయాలను గమనించాలి. కొనుగోలు చేసిన బిల్లుపై డీలరు సంతకం ఉండాలి. రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి. వ్యవసాయాధికారులు సూచించిన విత్తనాలను కొనుగోలు చేస్తే మంచిది. హైబ్రిడ్ విత్తనాలు కొనుగోలు చేసేటపుడు విత్తనం రకం, స్వచ్ఛత, మొలకెత్తే స్వభావం, జన్యు నాణ్యత వంటి వివరాలను పరిశీలించాలి. మొలకెత్తే దశ, పూత దశలో లోపం కనిపిస్తే మండల వ్యవసాయాధికారిని సంప్రదించాలి.

ఎరువుల విక్రేతలు..

ఎరువులను విక్రయించే వారు ప్రభుత్వం నుంచి విధిగా గుర్తింపు పొందాలి. నమోదు పత్రంలో పొందుపరిచిన ఎరువులనే విక్రయించాలి. డీలర్లు తమ వద్ద ఉన్న ఎరువులను వాటి ధరలను స్టాక్ బోర్డుపై ప్రదర్శించాలి. రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు విధిగా బిల్లులు ఇవ్వాలి. నిర్ణయించిన ప్రమాణం లేని ఎరువులను డీలర్లు విక్రయించరాదు. బస్తాలపై చట్ట ప్రకారం నిర్దేశించిన ప్రామాణికాలు లేని ఎరువులను విక్రయించరాదు. కల్తీ, నాణ్యత లోపించిన ఎరువులు, చిరిగిన, తేమ వచ్చిన బస్తాలు ఉంటే వాటిపై ఎర్రటి సిరాతో గుర్తు వేసి, పక్కన పెట్టేయాలి. అటువంటి వాటిని రైతులు కొనుగోలు చేయరాదు.

విత్తనశుద్ధి

కిలో విత్తనాలకు రెండున్నర గ్రాముల కార్బన్‌డైజం కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. నీటిలో నానబెట్టి నట్లయితే లీటరు నీటికి ఒక గ్రాము కార్బన్‌డైజంను కలిపి ఆ ద్రావణంలో 24 గంటలు నానబెట్టి మండి కట్టి దంప నారుమడిలో చల్లుకోవాలి. విత్తనం నానబెట్టడానికి ఒక కిలో విత్తనానికి ఒక లీటరు నీరు సరిపోతుంది. కార్బన్‌డైజం కాకుండా విత్తనశుద్ధికి 'సూడోమోనాస్ ఫ్లోరసెన్స్'అనే జీవ శిలీంధ్ర నాశినిని కూడా ఉపయోగించవచ్చు. ఈ శిలీంధ్రం కాకినాడలోని బయోలాజికల్ కంట్రోల్ ల్యాబొరేటరీలో తయారవుతోంది. ఇది వ్యవసాయశాఖ వద్ద మాత్రమే లభిస్తుంది. సూడోమోనాస్ ఫ్లోరసెస్ మందును కేజీ విత్తనాలకు ఎనిమిది గ్రాముల మందును వినియోగించాలి. దీని వల్ల విత్తనం ద్వారా, భూమి నుంచి శిలీంధ్రం ద్వారా వచ్చే తెగుళ్లను సమర్థవంతంగా అరికట్టవచ్చు. రైతులు సొంత విత్తనాల వినియోగానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. గత 10–15 ఏళ్లుగా సొంత విత్తనం తయారీపై వ్యవసాయ శాఖ రైతులకు అవగాహన కల్పించారు. దాంతో రైతులు సొంత విత్తన తయారీకి అలవాటు పడ్డారు. స్వపరాగ సంపర్కంతో వృద్ధి చెందే వరి పంట విత్తనాలను ఏ రైతు కారైతు సులభంగా, నాణ్యంగా ఉత్పత్తి చేసుకోవచ్చు. తద్వారా కల్తీ విత్తనాల బారి నుంచి తప్పించుకోవచ్చు.

మొలక పరీక్ష చేసుకోవాలి

- రైతులు విత్తు కోవడానికి ఒక రోజు ముందు విత్తనాలను కొనుగోలు చేయడం వల్ల మొలక పరీక్షలు చేయించుకోవడం లేదు. కాని విత్తనం కొనుగోలు చేసిన తర్వాత తప్పనిసరిగా మొలక పరీక్ష చేయించుకోవాలి. రైతు కొనుగోలు చేసిన విత్తనాల సంచి నుంచి 100 గింజలను 24 గంటల పాటు నీటిలో నానబెట్టి, అనంతరం ఒక గుడ్డలో చీకటి, గాలి తగలని ప్రదేశం ఉంచాలి. 24 గంటల తర్వాత తీసి చూస్తే 100 గింజలకు 75 గింజల పైన మొలక వస్తే మంచి విత్తనంగా నిర్ధారించుకుని, నారుమడి వేసేందుకు సిద్ధం చేసుకోవాలి.
- మొలక శాతం కనీసం 75 శాతం వరకు ఉంటే విత్తనాలు నాణ్యమైనవని భావించి విత్తుకోవాలి. విత్తనముల ద్వారా వచ్చే తెగుళ్లను విత్తనశుద్ధి చేయడం ద్వారా అరికట్టవచ్చు.

నాణ్యమైన విత్తనంతోనే దిగుబడులు



రైతులు విత్తన ఎంపికలో జాగ్రత్తలు వహించాలి. నాణ్యమైన విత్తనంతోనే అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుంది. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను వ్యసాయ సొసైటీలు, రైతు భరోసా కేంద్రాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటుంది. ఎక్కడా ఎరువులు, విత్తనాల కొరత వచ్చే ప్రసక్తి ఉండదు.

– కొప్పిశెట్టి ప్రభాకర్, ఏవో, రాయవరం మండలం

అప్రోచ్ లేక అవస్థలు



దంగేరు–శివల రహదారిలో వంతెన వద్ద అప్రోచ్ లేక ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

కె.గంగవరం: దంగేరు నుంచి శివల వెళ్లే రహదారిలో వంతెన వద్ద అప్రోచ్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వంతెనకు ఇరువైపులా ఉన్న రోడ్డుకు అప్రోచ్ కొట్టుకుపోయింది. దీని వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి సమయంలో అప్రోచ్ లేని విషయాన్ని గమనించిని ప్రయాణికులు ప్రమాదానికి గురై గాయాల పాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. రెండువైపులా ఇది పరిస్థితి ఉండడంతో చాలా ప్రమాదకరంగా ఉందని వారు అంటున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వెంటనే అప్రోచ్ నిర్మించాలని గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

నాడు–నేడు పనులు పూర్తి చేయాలి

కపిలేశ్వరపురం: జూన్ 12న పాఠశాలలను తెరవనున్న నేపథ్యంలో నాడు –నేడు పథకంలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేసి పాఠశాలలను వినియోగంలోకి తీసుకు రావాలని అకడమిక్ మానిటరింగ్ అధికారి పిల్లి రాంబాబు ఆదేశించారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో సోమవారం నాడు–నేడు పనులపై ఎంఈఓ కె.తాతారావు సమక్షంలో సమీక్ష నిర్వహించారు. పాఠశాలల వారీగా ప్రగతిపై చర్చించారు. రాంబాబు మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరంలో విద్యా ప్రణాళికను పకడ్బందీగా అమలు చేసేందుకు ఉన్నతాధికారులు ఆదేశించినట్టు తెలిపారు.

రోడ్డు పక్కన తుప్పలు తొలగించాలి



గొల్లపాలెం–తణుకువాడ గ్రామాల మధ్య రోడ్డు మలుపులో దట్టంగా పెరిగిన ముళ్లపొదలు

కాజులూరు: గొల్లపాలెం, తణుకువాడ రహదారిలో రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగి ఉన్న తుప్పలను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ రహదారిలో ఇటీవల కురిసిన చెదురుమదురు వర్షాలకు గొల్లపాలెం నుంచి దేగలపేట మధ్యలో రహదారి ఇరువైపులా దట్టమైన ముళ్లపొదలు, గడ్డి మొక్కలు పెరిగి ఉన్నాయి. ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఈ ముళ్ల పొదల కారణంగా దగ్గరకు వచ్చే వరకు ఒకదానికి ఒకటి కనిపించడం లేదు. దీనికి తోడు రోడ్డుపై దగ్గర దగ్గరగా ప్రమాదకర మలుపులు ఉన్నాయి. మలుపులు, తుప్పల కారణంగా వాహన చోదకులు తీవ్ర ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పక్కల ఉన్న పొదలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇసుక అక్రమ రవాణా

తాళ్లరేవు: నకిలీ బిల్లులతో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మరో లారీని ఎస్ఈబీ అధికారులు ఆదివారం రాత్రి సీజ్ చేశారు. కేంద్రపాలిత ప్రాంతమైన యానాం, ఆంధ్రా సరిహద్దులో కొంతమంది జోరుగా ఇసుకను తరలిస్తున్నారు. ఆంధ్రా బిల్లులు చూపించి యానాంలో ఇసుకను విక్రయించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. జాతీయ రహదారి 216లోని సుంకరపాలెం సెంటర్‌లో ఎస్ఈబీ అధికారులు ఇసుక అక్రమంగా తరలిస్తున్న మరో లారీని పట్టుకున్నారు. ధవళేశ్వరం నుంచి ఇసుకను తెచ్చినట్లు చెబుతున్నా బిల్లులు నకిలీవని తేలడంతో లారీని సీజ్ చేసి కోరంగి పోలీసులకు అప్పగించారు.

పరుగుపందెం విజేతకు అభినందనలు



అథ్లెటిక్స్ ఓపెన్ చాంపియన్‌షిప్ పరుగుపందెం విజేత యాతం నాగబాబును సత్కరిస్తున్న గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది

కాజులూరు: అథ్లెటిక్స్ ఓపెన్ ఛాంపియన్‌షిప్ 2024లో పాల్గొని పరుగుపందెంలో వెండి, బంగారు పథకాలు సాధించిన యాతం నాగబాబును గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది సోమవారం ఘనంగా సత్కరించారు. వైద్య, ఆరోగ్యశాఖలో జిల్లా మలేరియా విభాగం సబ్ యూనిట్ అధికారిగా పని చేస్తున్న యాతం నాగబాబు పలు అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని 60 వరకూ పథకాలు సాధించడమే కాకుండా ఇటీవల ముంబయిలోని సొమ్య విద్యావిహార్ స్పోర్ట్స్ స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి 43వ అథ్లెటిక్స్ పోటీల్లో 800 మీటర్ల విభాగంలో రజత పతకాన్ని, 1600 మీటర్ల రిలేలో బంగారు పతకాన్ని, 400 మీటర్ల రిలేలో రజత పతకాన్ని సాధించారు. గొల్లపాలెం పీహెచ్‌సీలో వైద్యాధికారులు డాక్టర్ సౌజన్య, డాక్టర్ శ్రేయల ఆధ్వర్యంలో సిబ్బంది యాతం నాగబాబుకు అభినందన సభ నిర్వహించి ఘనంగా సత్కరించారు. 55 ఏళ్ల వయస్సులోనూ నాగబాబు పరుగుపందెంలలో పథకాలు సాధిస్తూ జిల్లా ఆరోగ్యశాఖకే ఎంతో గుర్తింపు తీసుకువస్తున్నారని వైద్యాధికారులు డాక్టర్లు, సిబ్బంది ప్రశంసలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది ఇమ్మంది లక్ష్మీప్రసన్న, నరాల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లికి వైఎస్సార్ సీపీ నాయకుల పూజలు



పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మండపేట: స్థానిక ఏడిద రోడ్డులో కొలువైన పెద్దమ్మ అమ్మవారిని ఇతర జిల్లాల వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం దర్శించుకున్నారు. జూన్ 4న వెలువడే ఎన్నికల ఫలితాల్లో తమ పార్టీ భారీ మెజారిటీ సాధించి, రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రికి బాధ్యతలు చేపట్టాలని ప్రార్థిస్తూ పెద్దమ్మ వారికి వారు ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు బొంతు నాగిరెడ్డి, కృష్ణా జిల్లా యువసేన కమిటీ అధ్యక్షుడు బలుసుపటి నాగ శ్రీనివాస్, అనపర్తి మాజీ శాసనసభ్యుడు తేతలి రామారెడ్డి కుమారుడు త్రినాథ్ రెడ్డి (త్రిమూర్తులు) పూజలు చేసిన వారిలో ఉన్నారు. వారికి ఆలయ వ్యవస్థాపకుడు వాలిన వీరబాబు, కమిటీ సభ్యుడు షేక్ అలీఖాన్ బాబా ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు.

అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని అందించండి



నరసాపురపేట కార్డన్ సెర్చ్‌లో మాట్లాడుతున్న సీఐ దొరరాజు, ఎస్సై సురేష్‌బాబు తదితరులు

రామచంద్రపురం రూరల్: ఎక్కడైనా అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రామచంద్రపురం సీఐ పి.దొరరాజు అన్నారు. మండలంలోని నరసాపురపేటలో సోమవారం జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్, డీఎస్పీ బి.రామకృష్ణ ఆదేశాల మేరకు సీఐ పి.దొరరాజు, ఎస్సై కె.సురేష్‌బాబుల నేతృత్వంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో గ్రామంలో సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు లేని 19 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు. సదరు వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించామని సంబంధిత వాహనదారులు పత్రాలను తీసుకురావాలని, లేనిచో రికార్డులు లేని మోటారు సైకిళ్ల వాహనదారులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. గ్రామంలో బయట వ్యక్తులు ఎవరైనా అనుమానాస్పదంగా ఉన్నట్లయితే వెంటనే తమకు తెలియజేయాలని తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు అవగాహన సదస్సును ఏర్పాటు చేసి కార్డెన్ అండ్ సెర్చ్‌పై వివరించారు.

విద్యార్థుల సేవలు అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రామకృష్ణ

రామచంద్రపురం: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్ సేవలు ప్రశంసనీయమని రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ అన్నారు. వీఎస్ఎం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సోమవారం జరిగిన సభలో విద్యార్థుల సేవలను అభినందిస్తూ వారికి పారితోషికం, ప్రశంసా పత్రాలను డీఎస్పీ అందజేశారు. జిల్లా ఎస్పీ శ్రీధర్ అనుమతి మేరకు విద్యార్థుల సేవలకు అభినందనలు తెలిపే కార్యక్రమం చేపట్టామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వీఎస్ఎం కళాశాలకు చెందిన 150 మంది వలంటీర్లు పాల్గొన్నారని తెలిపారు. నాయకత్వ లక్షణాలతో విద్యార్థులు పరిణతి చెందే అవకాశం వచ్చిందని తెలిపారు. ఎన్నికలు అంటే పవిత్రంగా భావించి క్లిష్టమైన పరిస్థితుల్లో ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా బాధ్యతాయుతంగా పనిచేయడంలో ఎన్‌సీపీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవల్ని వినియోగిస్తామని వివరించారు. కార్యక్రమంలో సీఐ పి.దొరరాజు మాట్లాడుతూ ఎన్నికల వేళ ఇటువంటి సేవలు అందించే అర్హత సాధించిన విద్యార్థులకు ఎస్ఐ సురేష్‌బాబు అభినందనలు తెలిపారు. వీఎస్ఎం అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్ఎన్ అలీ అన్సారి విద్యార్థులను సేవకులుగా తయారు చేయడంలో వీఎస్ఎం సంస్థల వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ మూర్తి ప్రతిష్టాత్మకంగా చర్యలు చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి, భూవరాహ స్వామి హోమాలు

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక బిళ్లవారి వీధిలో వేంచేసియున్న పద్మావతి, అలివేలు మంగా సమేత వేంకటేశ్వర స్వామివారి తీర్థ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం లక్ష్మీగణపతి, భూవరాహ స్వామి హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. బ్రహ్మశ్రీ కారుపర్తి మల్లేశ్వరరావు శిష్య బృందం అర్చకత్వంలో ఈ హోమ క్రతువు జరిగింది. తొలుత స్వామి, అమ్మ వార్లకు ఏకాదశ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు.

చమురు సంస్థలు నిధులివ్వాలి

- మున్సిపల్ కౌన్సిల్‌లో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు
- టౌన్ ప్లానింగ్ వైఖరిపై ధ్వజమెత్తిన పాలక పక్ష కౌన్సిలర్లు



కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

అమలాపురం టౌన్: స్థానిక పంస్థలైన మున్సిపాలిటీలు, మండల పరిషత్, గ్రామ పంచాయతీల పురోగతికి ఈ ప్రాంతంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న చమురు సంస్థలు తమ వంతు నిధులివ్వాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మేరకు కౌన్సిల్‌లోని 30 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసిన వినతి పత్రాన్ని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు కౌన్సిల్ తరపున కమిషనర్ ఎస్.మనోహర్‌కు అందజేశారు. ఇదే డిమాండ్‌ను కౌన్సిల్ తీర్మానం చేయాలని కౌన్సిలర్లు కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ మనోహర్ ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున ఈ అంశాన్ని వచ్చే కౌన్సిల్ సమావేశంలో చర్చకు తీసుకొచ్చి కౌన్సిల్ ఆమోదించేలా చేస్తామని స్పష్టం చేశారు. మన ప్రాంతంలో లభ్యమవుతున్న డొమిస్టిక్ గ్యాస్‌ను గృహ అవసరాలకు చమురు సంస్థలు ఉచితంగా ఇవ్వాలని ఎమ్మెల్సీ కోరారు. కోనసీమ భూముల్లో కార్యకలాపాలు చేస్తూ రూ.కోట్లలో ఆదాయం పొందుతున్న చమురు సంస్థలు ఈ ప్రాంతంలోని స్థానిక సంస్థలకు నిధులు విదపకపోవడంపై ఎమ్మెల్సీ ఆవేదన వ్యక్తం చేశారు.

టౌన్ ప్లానింగ్ వైఖరిపై పాలక పక్షం ధ్వజం

మున్సిపల్ దుకాణాల అద్దెలు చెల్లింపులు, ఆక్రమణలు, భవన నిర్మాణాల ప్లాన్‌లకు అనుమతుల విషయంలో టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై పాలక పక్షానికి చెందిన కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, గొవ్వాల రాజేష్‌లు ధ్వజమెత్తారు. మున్సిపల్ కార్యాలయం చెంతనే ఉన్న ఓ మున్సిపల్ షాపును లీజు తీసుకున్న వ్యక్తి మధ్యలో అంత అద్దె చెల్లించలేనని చేతులెత్తేస్తే ఆ లీజుదారుడిని రద్దు చేయకుండా కొత్త లీజుదారుడిని ఆమోదించాలన్న అంశాన్ని కౌన్సిల్‌కు ఎలా తీసుకొచ్చారని ప్రశ్నించారు. ఏదైనా షాపు ఓ వ్యక్తి లీజు తీసుకుంటే ఆ లీజు కాల పరిమితి ముగిసే వరకూ ఆ వ్యక్తే మొత్తం లీజు చెల్లించే నిబంధన ఉందని కమిషనర్ మనోహర్ వివరణ ఇచ్చారు. చైర్‌పర్సన్ నాగేంద్రమణి, కమిషనర్ మనోహర్‌లు చెప్పిన సమాధానాలపై సంతృప్తి వ్యక్తం చేయని పాలక పక్షం ఆ అంశాన్ని వాయిదా వేసింది. పట్టణంలో అక్రమ కట్టడాలపై ఇప్పటి వరకూ ఎన్ని కేసులు నమోదు చేశారన్న కౌన్సిలర్ రాజేష్ ప్రశ్నకు పట్టణ ప్రణాళిక అధికారి చిన్నా బదులిస్తూ 62 కేసులు ఉన్నాయని, కొత్తగా మరో 22 గుర్తించామని చెప్పారు. పట్టణ ప్రణాళిక విభాగం పట్టణంలో 7 సెంట్లకు మించిన భవనాలకు ప్లాన్‌కు అనుమతి ఇవ్వకూడదన్న నిబంధన ఉన్నా పద్మినీపేట ప్రాంతంలో 14 సెంట్లలో నిర్మిస్తున్న భవనానికి ఎలా అనుమతులు ఇచ్చారని కౌన్సిలర్ నాగేంద్ర ప్రశ్నించారు. దీనిపై ప్రణాళిక అధికారి సమాధానమిస్తూ తొలుత భవన యజమాని 7 సెంట్లకు ప్లాన్ అనుమతి పొందినా, మరో 7 సెంట్లకు కొత్తగా అనుమతి కోరారని చెప్పారు. పట్టణ ప్రణాళిక అధికారుల సమాధానాలపై కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. టౌన్ ప్లానింగ్‌ను అస్తవ్యస్తంగా తయారు చేశారని, కొత్తగా వచ్చిన కమిషనర్ దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టకపోతే ఆ విభాగం సర్వనాశనం అవుతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, కౌన్సిలర్లు దొమ్మేటి రాము, యేడిద శ్రీను, నాగారపు వెంకటేశ్వరరావు, చిట్టూరి పెదబాబు పలు సమస్యలపై చర్చించారు.

విజయోత్సవ ర్యాలీలు నిషేధం



సమావేశంలో పాల్గొన్న వివిధ రాజకీయ పక్షాల నేతలు



రాజకీయ పక్షాల నేతలనుద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ రామకృష్ణ

- కౌంటింగ్ ముగిసే వరకూ 144 సెక్షన్ అమలు
- అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు
- రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ

రాయవరం: జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం విజయం సాధించిన పార్టీల నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకోవడం, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం నిషేధమని రామచంద్రపురం డీఎస్పీ కె.రామకృష్ణ వివిధ రాయకీయ పార్టీల నేతలకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో సోమవారం రాత్రి వివిధ రాజకీయ పక్షాల నేతలతో తహసీల్దారు ఆర్వీ కృష్ణారావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ రామకృష్ణ మాట్లాడుతూ విజయోత్సవ ర్యాలీలు, డీజేలు, ఊరేగింపులపై ఆంక్షలు ఉన్నాయన్నారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకూ పోలీస్ యాక్ట్ 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పరస్పరం రెచ్చగొట్టుకునేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా రెచ్చగొట్టేలా ప్రవర్తించినా, గొడవలను ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవన్నారు. వ్యక్తిగత, పార్టీల పేరుతో గొడవలకు దిగి, ఘర్షణ వాతావరణం సృష్టిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల సమాచారం పోలీసులకు ఇవ్వాలన్నారు. పోలీసు నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో తహసీల్దారు ఆర్వీ కృష్ణారావు, మండపేట రూరల్ సీఐ కె.శ్రీధర్‌కుమార్, రాయవరం ఎస్సై జి.నరేష్‌లు మాట్లాడుతూ ప్రజలు వివాదాలకు దూరంగా ఉండి, ప్రశాంతంగా, ఐకమత్యంతో మెలగాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఆర్ఐ పంపన రామారావు, మండలంలోని పలు గ్రామాలకు చెందిన వివిధ రాజకీయ పక్షాల నాయకులు పాల్గొన్నారు.